క్లుప్తంగా

పోడు రైతులు రైతుబీమాకు అర్హులు

కొల్లాపూర్ రూరల్: పోడు రైతులు రైతుబీమాకు అర్హులని ఏఓ నాగరాజు అన్నారు. శనివారం ఆయన వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి ముక్కిడిగుండం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ముక్కిడిగుండం, నార్లాపూర్, మొలచింతలపల్లి గ్రామాల్లో పోడు భూములు శిస్తూ చేసుకుంటున్న గిరిజన రైతులకు ఇటీవల ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందని వీరు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 8వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దశరథంనాయక్, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: బొలెరో, బైక్ ఎదురెదురుగా ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మున్సిపాలిటీలోని ఉయ్యాలవాడ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాడూరు మండలం తిర్మలాపూర్‌కి చెందిన స్వామిగౌడ్ వివిధ పనుల నిమిత్తం బైక్‌పై జిల్లా కేంద్రానికి వచ్చాడు. పనులు ముగించుకొని వెళ్తుండగా ఉయ్యాలవాడ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

రహదారి పరిశీలన

బల్మూర్: మండలంలోని గట్టుతుమ్మెన్–తుమ్మెన్‌పేట రహదారిని శనివారం డీఆర్‌డీఓ నర్సింగరావు పరిశీలించారు. తుమ్మెన్‌పేట నుంచి ఏడాది కిందట వాగు వరకే రోడ్డు వేయగా అది కేవలం 8 ఫీట్లు మాత్రమే ఉండటంతో వ్యవసాయ పొలాలకు, గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని వాగు నుంచి గట్టుతుమ్మెన్ వరకు రోడ్డును వెడల్పు చేయాలని సర్పంచ్ నాగరాజ్ కోరారు. దీంతో డీఆర్‌డీఓ రోడ్డును పరిశీలించారు.

వసతులు కల్పించాలి

కొల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు యూసుఫ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు నేటికీ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించలేదన్నారు. యూనిఫాం దుస్తులు అందించాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేపడుతామన్నారు.

నేడు సాయిచంద్ సంతాప సభ

కందనూలు: ప్రముఖ కవి గాయకులు తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ వేద సాయిచంద్ సంతాప సభ ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు తెలంగాణ దళిత సమాఖ్య అధ్యక్షుడు ఎదిరెపల్లి కాశన్న తెలియజేశారు. శనివారం జిల్లా కేంద్రంలో స్థానిక కవులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సంతాప సభకు ముఖ్యఅతిథులుగా ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం, సినీ రచయిత మిట్టపల్లి సురేందర్ హాజరవుతారని తెలియజేశారు. వనపట్ల సుబ్బయ్య, శివ, ముచ్చర్ల దినకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ అదృశ్యం కేసు నమోదయినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాల్టీ పరిధిలోని నాగనూలుకు చెందిన చంద్రకంటి జంగమ్మ గత నెల 27న కూలీ పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకి లభ్యం కాలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివాహిత భర్త సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

ఎస్పీకి ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ రూరల్: చారకొండ ఎస్‌ఐపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. శనివారం బీఎస్పీ నాయకులు ఎస్పీ మనోహర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ మాట్లాడారు. చారకొంగ ఎస్‌ఐ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి సామాన్య ప్రజలపై చేయి చేసుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, అంతటి నాగన్న, పృథ్వీరాజ్, రాంచందర్, మహేష్ యాదవ్, హర్ష, రాము, నాగరాజుపాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో కనీస మౌలిక వసతులు లేవని, పరిశుభ్రత ఏమాత్రం లేదని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ ఆరోపించారు. శనివారం సీపీఎం నాయకులు ఆస్పత్రిని సందర్శించి మౌలిక వసతుల కల్పనపై సర్వే నిర్వహించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తెలకపల్లి: మండల పరిధిలోని గౌతంపల్లిలో శనివారం సొసైటీఫర్ సోషల్ కాన్ఫరెన్స్ ఎస్‌ఎస్‌టీ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ సహకారంతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రిజర్వ్ బ్యాంక్ స్కీంలు, అటల్‌పింఛన్ యోజన, ప్రధానమంత్రి సురక్షబీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్ జ్యోతి, శశిపాల్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

వంగూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల అకౌంట్లలో జమ చేసిన రైతుబంధు డబ్బులు ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురిచేయొద్దని ఎంపీ రాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బ్యాంకులోకి వెళ్లి రైతులతో మాట్లాడారు. క్రాప్‌లోన్ రెన్యూవల్ కోసం రైతుబంధు డబ్బులను పట్టుకొని రెన్యూవల్ చేస్తున్నారని దృష్టికి వచ్చిందని, బ్యాంకు మేనేజర్‌ను వివరణ అడిగాడు. అలా చాలా ఫిర్యాదులు వచ్చాయని, అలాంటి పరిస్థితి నిజంగా ఉందని తేలితే చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తానని అన్నారు.

అభివృద్ధి దిశగా తెలంగాణ

రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ ముందుచూపు ఆలోచనతో అభివృద్ధి దిశగా సాగుతుందని ఎంపీ రాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రతి సామాజిక వర్గానికి చేరువయ్యాయని అన్నారు.



బ్యాంకు వద్ద అధికారులు, రైతులతో మాట్లాడుతున్న ఎంపీ రాములు

- మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ సంతాపసభలో ఎంపీ రాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

బిజినేపల్లి: మండలంలోని గౌరారంలో 'మన ఊరు–మన బడి' కార్యక్రమం రూ.30 లక్షలతో పాఠశాల నూతన భవనానికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. అదే విధంగా గ్రామంలో మత్స్యకార సహకారం సంఘం భవనానికి రూ.5 లక్షలతో ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో ఆయా వాడల్లో సీసీ రోడ్లను, డ్రెయినేజీలను పరిశీలించడమే కాకుండా గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే తన అలవెన్స్‌ను విరాళంగా ఇవ్వనున్నట్లు శనివారం ప్రకటించారు. పాఠశాలలో మౌలిక వసతుల ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, పాఠశాలలో మరిన్ని వసతుల కోసం తన అలవెన్స్ రూ.2.5లక్షలు విరాళంగా ఇవ్వనున్నట్లు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి

బీఆర్‌ఎస్‌లో చేరిన వారిని ఆదుకుంటాం..

కొల్లాపూర్ రూరల్: బీఆర్‌ఎస్‌లో చేరిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని తాళ్ల నరసింహ పరంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు వర్గీయులు ఎమ్మెల్యే సమక్షంలో దాదాపు 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. అందరూ కలిసికట్టుగా పార్టీ కోసం పనిచేయాలన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో భవిష్యత్‌లో కొల్లాపూర్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా సమావేశం



ఊర్కొండ: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ బక్క రాధ అధ్యక్షన నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. రాంరెడ్డిపల్లి ఎంపీటీసీ గోపాల్ గుప్త, లావణ్య, అమరేశ్వర్ రెడ్డి, ఖలీమ్ పాష, రాజయ్య, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సాగిన సామాజిక తనిఖీ



లింగాలలో సామాజిక తనిఖీల నివేదికలను పరిశీలిస్తున్న అధికారులు

లింగాల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం డీఆర్‌డీఓ ఏపీడీ రాజేశ్వరీ అధ్యక్షతన నిర్వహించిన 13వ విడత ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక సజావుగా కొనసాగింది. వారం రోజులుగా తనిఖీ బృందాలు 2021 మార్చి నుంచి 2023 మార్చి వరకు జరిగిన పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి గ్రామసభలు నిర్వహించారు. అనంతరం మండలంలోని 23 గ్రామపంచాయతీల పనుల నివేదికలను సామాజిక ప్రజావేదికలో బహిర్గతం చేశారు. పలు గ్రామాల్లో నిర్వహించిన పనుల్లో మస్టర్లలో పూర్తిస్థాయిలో సంతకాలు లేకుండానే బిల్లులు చేయడం, పనులకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయకపోవడం, కొన్ని పంచాయతీల్లో అన్ని రకాల రికార్డులను నిర్వహించకపోవడం, వేలి ముద్రలు సక్రమంగా పనిచేయకపోవడంతో కొంత మంది కూలీలకు సకాలంలో కూలి డబ్బులు చెల్లింకపోవడం వంటి తప్పిదాలను తనిఖీ బృందాలు గుర్తించాయి.

రూ.35,508 రికవరీకి ఆదేశాలు

మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో మొత్తం రూ.6.80 కోట్ల పనులు నిర్వహించారు. ఇందులో 10 గ్రామపంచాయతీల్లో ఎలాంటి రికవరీలు, పెనాల్టీలు లేకపోవడం ఇదే మొదటి సారి. మరో 13 గ్రామపంచాయతీల్లో వివిధ పనులకు సంబంధించి రూ. 35, 508 రికవరీ చేయాలని సంబంధిత అధికారు లు ఆదేశాలు జారీ చేశారు. అంబుడ్స్‌మెన్ జంగ య్య, జిల్లా విజిలెన్స్ సెల్ అధికారి నసీర్, కొండల్, శ్రీని వాస్, ఎంపీడీఓ గీతాంజలి, ఇమాం అలీ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

అచ్చంపేట రూరల్: మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. నిరుపేద మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టు మిషన్లు పంపిణీ చేయనుందన్నారు. అచ్చంపేటలో మైనార్టీల కోసం నూతన ఫంక్షన్ హాలు నిర్మాణం చేపడుతామన్నారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, మనోహర్, అమీనొద్దీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

లింగాల: వివిధ అనారోగ్య కారణాలతో మృతిచెందిన మండల పరిధిలోని చెన్నంపల్లికి చెందిన బాలమ్మ, పద్మన్నపల్లికి చెందిన బల్మూరి చిన్న కుటుంబాలను శనివారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు కొంత ఆర్థిక సాయం అందజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

ఇంటింట బీజేపీ సంక్షేమ పథకాలు



వెల్దండలో చెదురుపల్లి గ్రామంలో బీజేపీం ఇంటింట కేంద్ర పథకాల ప్రచారం చేస్తున్న ఆచారి.

వెల్దండ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింట ప్రచారం చేయాలని జాతీయ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నగారగడ్డతండా, చెదురుపల్లిలో ఇంటింట తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. శేఖర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను గడప గడపకు బీజేపీ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యెల్లేని సుధాకర్ రావు అన్నారు. వెనచర్లలో ప్రధానమంత్రి పసల్ బీమా యోజన, ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి యోజన, రైతులకు సబ్సిడీపై అందిస్తున్న ఎరువులపై ప్రచారం చేశారు. భీమేష్‌రెడ్డి, తిరుమల్, జలాల్‌శివుడు, రాజు, లింగస్వామి, శివ, శేకర్ పాల్గొన్నారు.

సంకల్ప రథయాత్ర విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్: పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 17న నిర్వహించే సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల భవనంలో సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తిలో నిర్వహించే రథయాత్రను ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. రథయాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. డివిజన్ టీపీఎస్ సాధన సమితి అధ్యక్షుడిగా రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కలుపు నివారణలో జాగ్రత్తలు అవసరం

లింగాల: వానాకాలం సాగు చేసిన మొక్కజొన్న పంటలో కలుపు నివారణకు మందులను పిచికారీ చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. శనివారం లింగాల శివారులో మొక్కజొన్న పంటను ఏఓ పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు సరైన సమయంలో కురువకపోవడంతో పంటలను రక్షించుకునే ప్రయత్నాలు చేసుకోవాలని తెలియజేశారు. ఇదే సమయంలో కలుపు నివారణకు ఉపయోగించే మందులను వ్యవసాయ శాఖ సూచనలు, సలహాల మేరకు వాడాలన్నారు.

గొల్లకురుమల అభివృద్ధే లక్ష్యం



రాఘయపల్లిలో గొర్రెల యూనిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: గొల్లకురుమల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రాఘాయిపల్లిలో రెండో విడతలో మంజూరైన గొర్రెల యూనిట్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం సబ్సిడీలో గొర్రెల యూనిట్లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వెల్దండ మండలంలో రెండో విడతలో ఎంపికై న చౌదర్‌పల్లి, రాఘాయిపల్లి గ్రామాల రైతులకు యూనిట్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. 12 మంది లబ్ధిదారులు డీడీలు చెల్లించడంతో వారికి మంజూరైన యూనిట్ల గొర్రెలను అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండలంలో నూతనంగా ఏర్పాటైన 7 గ్రామపంచాయతీలకు భవన నిర్మాణాలకు, మూడు పల్లె దవాఖానాలకు, రెండు బీటీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పంచాయతీ భవనాల నిర్మాణాలకు, పల్లె దవాఖానాల నిర్మాణాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు చెప్పారు.

ఓఆర్సీ పట్టాలపై నిరసన...

రైతులు సాగుచేస్తున్న వ్యవసాయ పొలాలకు దాదాపుగా 1200 ఎకరాల్లో ఓఆర్సీ పట్టాలు ఉండటంతో దాదాపుగా 30 ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యే రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి ఓఆర్సీ పట్టాలపై నిరసన తెలిపారు. కలెక్టర్ సమక్షంలో సమావేశం నిర్వహించి సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు.

వాల్‌పోస్టర్ విడుదల

తాడూరు: జిల్లా కేంద్రంలో నిర్వహించే విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో శనివారం విశ్వబ్రాహ్మణ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు వీరాచారి మాట్లాడారు. బహిరంగ సభ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను సభలో పాల్గొనే ప్రజాప్రతినిధులకు వివరిస్తామన్నారు.18న బహిరంగ సభ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. ఆంజనేయులు, కృష్ణమాచారి, విశ్వనాథం, బాలకృష్ణ, చంద్రమౌళి పాల్గొన్నారు.

పీర్లచావిడి నిర్మాణానికి భూమిపూజ

కొల్లాపూర్: పట్టణంలోని రాజవీధి జమ్మిచెట్టు సమీపంలో పీర్లచావిడి నిర్మాణానికి శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి భూమిపూజ చేశారు. గతంలో ఇక్కడ ఉన్న పీర్లచావిడి పూర్తిగా శిథిలమైంది. దీంతో రూ.లక్ష వ్యయంతో నూతనంగా పీర్లచావిడి నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్య, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణయ్య, కౌన్సిలర్ డాక్టర్ రాముడుయాదవ్, స్వామిరెడ్డి తదితరులున్నారు.

కార్యవర్గ ఎన్నిక

అచ్చంపేట: వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంలో శనివారం నియోజకవర్గ వడ్డెర సంఘం కమిటీని ఎన్నుకున్నారు. వరికుప్పల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీలో నూతన అధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, కోశాధికారిగా పాండు ఎన్నికయ్యారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయం

అచ్చంపేట రూరల్: ప్రత్యేక ప్రణాళిక, అందరి సహకారంతో పట్టణ అభివృద్ధికి పాటు పడతామని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డులను పరిశీలించారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్ రమేష్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా గోరింటాకు వేడుక

కల్వకుర్తి రూరల్/ ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కల్వకుర్తి సావిత్రీబాయిపూలే ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శనివారం ఉపాధ్యాయినులు, విద్యార్థినులు గోరింటాకు వేడుకను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆషాఢ మాసం విశిష్టతను, గోరింటాకు ప్రత్యేకతను ఉపాధ్యాయులు వివరించారు. గోరింటాకు చేతులకు అందంగా అలంకరించుకున్నారు.



కల్వకుర్తిలో..

విద్యార్థులను పాఠశాలకు పంపాలి



మంచాలకట్టలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించిన ఉపాధ్యాయులు

తాడూరు: చదువుతోనే అభివృద్ధి ముడిపడి ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సాయిప్రభ, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్ అన్నారు. శనివారం ఆయా పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తరగతి గదిలో విద్యార్థులకు బోధన ఎలా జరిగింది, విద్యార్థులు చదువుతున్న తీరు, తెన్నులను తల్లిదండ్రులు కనీసం గంట సమయం కేటాయించి, వారిని పట్టించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. శ్రీనివాస్, ప్రవీన్, శివలీల, ఎల్లయ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రులు దృష్టి సారించాలి

బిజినేపల్లి: సర్కారు బడుల్లో విద్యను అభ్యసించే విద్యార్థులపై వారి తల్లిదండ్రులు దృష్టి సారించాలని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ సూచించారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పాఠశాల చైర్మన్ చిన్న బాలయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్టలో ప్రాథమిక పాఠశాలలో, పలు గ్రామాల పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండేలా, చదువుపై శ్రద్ధ చూపటం, ఇంటి వద్ద చదువుకునేలా పనిచేయడం వంటివి తల్లిదండ్రులు నేర్పించాలని అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల ముందే విద్యార్థులతో పాఠ్యపుస్తకాలు చదివించి వినిపించారు.

బీసీ సదస్సుకు తరలిన నాయకులు

కొల్లాపూర్: హైదరాబాద్‌లో శనివారం జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన బీసీ సదస్సుకు కొల్లాపూర్ నుంచి బీసీ సంఘాల నాయకులు తరలివెళ్లారు. పట్టణంలోని జ్యోతిరావుపూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజ్యాధికారం కోసం బహుజనులు ఏకం కావాలన్నారు. కట్టా శ్రీనివాసులు, యాదన్నగౌడ్, అన్వేష్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్ న్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం పనులు చేపట్టాలని ఎంపీడీఓ గంగామోహన్ తెలియజేశారు. శనివారం మండల కేంద్రంలోని దళితవాడను సందర్శించి కమ్యునిటీ ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో మురుగు సాఫీగా వెళ్లిపోయేందుకు నిర్మించిన డ్రెయినేజీల చివరి ప్రదేశంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి ఉపాధిహామీ ద్వారా రూ.13 వేలు మంజూరు చేసిందని తెలియజేశారు.

రేవంత్ మాటలు వక్రీకరించడం తగదు

కల్వకుర్తి రూరల్: రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను అధికార బీఆర్‌ఎస్ పార్టీ వక్రీకరించడం తగదని అన్నారు.

విరాళం అందజేత

కల్వకుర్తి: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ దేవాలయానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ రూ.1,00,116 విరాళాన్ని ప్రకటించారు. అందులో భాగంగా శనివారం రూ.50 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. లక్ష్మయ్య, పర్వతాలు, రవియాదవ్, సైదులు యాదవ్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఎక్స్‌టర్ మినీ ఎస్ యూవీ

నాగర్‌కర్నూల్ క్రైం: హుందయ్ కంపెనీ నుంచి వచ్చిన నూతన మోడల్ ఎక్స్‌టర్ మినీ ఎస్ యూవీ కారును జిల్లా కేంద్రంలోని హుందయ్ షోరూంలో ఎస్పీ మనోహర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజర్ రఘువరన్ మాట్లాడారు. ఎక్స్‌టర్ మినీ ఎస్ యూవీ 7 రంగుల్లో అందుబాటులో ఉందన్నారు. ఎక్స్ షోరూం ధర రూ.5.99 లక్షల నుంచి రూ.9.32 లక్షల వరకు లభిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో షోరూం సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని షోరూంలో ఎక్స్‌టర్ మినీ ఎస్ యూవీని ప్రారంభించిన ఎస్పీ మనోహర్

పంచాయతీ కార్మికుల భిక్షాటన

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ గ్రామాల్లో పంచాయతీ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు.– 'సాక్షి' నెట్‌వర్క్

